ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన-2 తేదిః 04.9.2014.

పువ్వులంటే ఇష్టపడని వారుంటారా? అందులోనూ గులాబి పూలు అంటే మనసు పడని వారుంటారా? పైగా గులాబి పువ్వంటే పుష్ప మహారాజు. గులాబి పూలలో ఒకటా? రెండా? లెక్కలేనన్నీ రంగులు, లెక్కకందని రకాలు. ఒక్క ఇండియాలోనే కాదు. ప్రపంచ వ్యాప్తంగా గులాబి పూలకు ఒకే రకమైన ఆదరణ, ఆకర్షణ, డిమాండ్ వున్నాయి. సాధారణ పౌరులే కాదు. సాక్షాత్తు తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు కూడా గులాబి పూలంటే ఎంతో ఇష్టం. గులాబి రంగంటే మరీ ఇష్టం. ఇలా అందరి ఇష్ట పుష్పమైన గులాబి పూల కోసం హైదరాబాద్ నగరంలో ఓ వేడుకే జరుగ బోతోంది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, వరల్డ్ ఫెడరేషన్ ఫర్ రోజ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 29న హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలో అంతర్జాతీయ గులాబి పూల ప్రదర్శన జరుగనుంది. ఈ ప్రదర్శన ఏర్పాట్లను ముఖ్యమంత్రి కేసిఆర్ గురువారం సచివాలయంలో సమీక్షించారు. వరల్డ్ ఫెడరేషన్ ఫర్ రోజ్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్, ఇండియన్ ప్రెసిడెంట్ అహ్మద్ ఆలం ఖాన్, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, వ్యవసాయ శాఖ కమీషనర్ బి.జనార్ధన్‌రెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయి గులాబి పూల ప్రదర్శన గతంలో భారతదేశంలో ఎన్నడూ జరగులేదని, మొదటి ప్రదర్శన తెలంగాణలో జరగడం ఆనందంగా, గర్వంగా వుందని ముఖ్యమంత్రి అన్నారు. ఆలం ఖాన్ కృ షితో ఈ ప్రదర్శనను హైదరాబాద్‌లో నిర్వహించడానికి వరల్డ్ ఫెడరేషన్ ఫర్ రోజ్ సొసైటీ

అంగీకరించిందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ అవకాశాన్ని తెలంగాణ ప్రజలు ముఖ్యంగా పుష్ప ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రదర్శనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 80 దేశాలకు చెందిన ప్రతినిధులు వివిధ రకాల గులాబి పూలతో ఈ ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. కేవలం పూల ప్రదర్శనే కాకుండా పూల తోటలు సాగుచేసే వారికి అవసరమైన సాంకేతిక శిక్షణ కూడా ఇందులో వుంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. మేలు రకం సాగు పద్ధతులు, గులాబి పూలలో వుండే రకాలు, వాటి ప్రత్యేకతలు, మార్కెటింగ్ అవకాశాలు, ఎక్కువ దిగుబడి రావడానికి అనుసరించాల్సిన పద్ధతులు తదితర అన్ని విషయాలను ప్రతినిధులు పరస్పరం పంచుకోవడానికి ఈ ప్రదర్శన వేదిక అవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ వున్న కట్ ఫ్లవర్స్‌ను 98 శాతం ఇజ్రాయిల్ దేశమే ఎగుమతి చేస్తున్నదని, తెలంగాణ రాష్ట్రం కూడా పువ్వుల పెంపకానికి అనువైన ప్రాంతమని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ప్రదర్శన ద్వారా గులాబి పూల పెంపకంపై ప్రజలలో అవగాహన, ఆసక్తి పెరుగుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

---

సిపిఆర్ఓ టూ సిఎం